క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన



పూలరథంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరి ప్రదర్శన కార్యక్రమం ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంలో కొలువుదీర్చి పూజలు చేసి భక్తులు గోవిందా నామస్మరణ చేస్తూ గిరి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్ర, అర్చకులు గోవిందశర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జలధికి పీర్ల స్వాములు



పీర్లను గుండం చుట్టూ ఊరేగిస్తున్న భక్తులు

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఆదివారం జలధి వేడుకలు నిర్వహించారు. ఆదివారం ఉదయం పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించి జలధికి తరలించారు. అలబిదాయే అంటూ బాధా తప్త హృదయాలతో పీర్లను జలధికి తీసుకెళ్లారు.

లేపాక్షి: మండలంలోని మామిడిమాకులపల్లి, గలిబిపల్లి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం జలధి కార్యక్రమాలను నిర్వహించారు. పీర్ల చావడి దగ్గర పీర్లను అలంకరించి ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్లను పీర్ల గుండం చుట్టూ ఊరేగింపు చేశారు. గ్రామస్తులు ఐకమత్యంతో అలావ్ తొక్కారు. తర్వాత జలధికి తరలించారు.

ఈడిగ విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లి ఉన్నత విద్యను అభ్యసించి ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని వక్తలు సూచించారు. ఆదివారం పట్టణంలోని ఆర్య ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈడిగ ప్యాలెస్‌లో జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి, ఇంటర్ మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 133 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే కేతి ప్రభాకర్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, సంఘం అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, కార్యదర్శి వినయ్ కుమార్, సర్పంచ్ తిరుమలేష్‌లు పాల్గొని పురస్కారాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణప్ప, ఆదిమూర్తి, వెంకటనారాయణప్ప, పుల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిన్నప్పయ్య, రిటైర్డ్ డీఈఓ మునయ్య, దేవేంద్రప్ప, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



కంబాలప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరుకు చెందిన కంబాలప్ప అనే వృద్ధుడు ఈనెల 2 నుంచి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కంబాలప్ప కుమారుడు వెంకటనారాయణ ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్లలో వెతికా ఫలితం లేకుండా పోయిందని వెంకటనారాయణ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా బ్రహ్మరథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడగెర గ్రామ సమీపంలో వెలసిన కాలువ రంగనాథస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మరథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవి సమేత రంగనాథస్వామికి కల్యాణం జరిపించారు. ఆ తర్వాత వేదపండితులు బ్రహ్మరథం ముందు పూజ రథోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

జోరుగా కలప దందా

- విచ్చలవిడిగా చెట్లను నరికి వేస్తున్న వైనం
- రాత్రికి రాత్రే టన్నుల కొద్దీ కలప రవాణా
- పట్టించుకోని అటవీ, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు



రొళ్ల చెరువులో టన్నుల కొద్ది కలపను నిల్వ ఉంచిన దృశ్యం



ట్రాక్టర్‌లో కలపను తరలించడానికి సిద్ధం చేసిన దృశ్యం

రొళ్ల: పచ్చదనం కాపాడుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, చెట్లుంటేనే క్షేమం లేకుంటే క్షామం.. అని పాలకులు, అధికారులు ప్రచారం చేస్తున్నారు. అయితే కొందరు స్వార్థపరులు మాత్రం స్వలాభం కోసం పచ్చని చెట్లను నరికి, కలప అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. కలప అక్రమ రవాణాపై నిఘా పెట్టాల్సిన అటవీ, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

సెంటు ఫ్యాక్టరీల కోసం..

మడకశిర నియోజకవర్గంలో అక్రమ కలప దందా జోరుగా సాగుతోంది. పెద్ద పెద్ద వృక్షాలను నరికివేస్తూ రాత్రి సమయంలో అక్రమ మార్గం గుండా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ముఖ్యంగా అమరాపురం మండలం సరిహద్దులో, అగళి మండలం ఉళ్లేకెర గ్రామంలో, రొళ్ల మండల కేంద్రంలోని చెరువు వెనుకాల సెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. సెంట్ ఫ్యాక్టరీలో ఉపయోగం కోసం కలపను జోరుగా తరలిస్తున్నారు.

వంద టన్నులకు పైగా నిల్వ..

ప్రస్తుతం రొళ్ల చెరువులో దాదాపు వందల టన్నులకు పైబడి కలప నిల్వ ఉండడం గమనార్హం. చెట్లను ఇష్టానుసారంగా నరికి కలపను తరలిస్తున్నప్పటికీ అరికట్టాల్సిన సంబంధిత అటవీ, రెవెన్యూశాఖల అధికారులు కూడా వ్యాపారులతో లాలూచి పడి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల గుండా రాత్రి సమయంలో అక్రమ మార్గాన ట్రాక్టర్ ద్వారా కలపను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

కనుమరుగవుతున్న వృక్ష సంపద

వృక్షాలను నరికి వందల టన్నులు తరలిస్తుండటంతో సకాలంలో వర్షాలు కురవక పంటలు పండటం లేదని రైతులు వాపోతున్నారు. భూగర్భజలాలు కూడా అడుగంటి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృక్ష సందపను కాపాడుకోకపోతే ఈ ప్రాంతం పూర్తిగా ఎడారిగా మారేందుకు ఎంతో సమయం పట్టదని అభిప్రాయపడుతున్నారు.

కర్ణాటక నుంచి కూడా..

కర్ణాటక రాష్ట్రాల నుంచి శ్రీగంధం చెక్కలు రొళ్ల సెంట్ ఫ్యాక్టరీకి అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. సెంట్ ఫ్యాక్టరీపై ఇప్పటికే కర్ణాటక పోలీసులు, ఆ ప్రాంతం అటవీశాఖ అధికారులు కూడా పలుమార్లు దాడులు నిర్వహించి పలువురిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికీ కోర్టు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇన్ని జరుగుతున్న కూడా రాష్ట్ర అటవీశాఖ, జిల్లా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అటు వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైన సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకొని వృక్షాలను నరికి కలపను తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి



మొక్కలు పెంచడం వల్ల ఆహ్లాదకరమైన వాతావరణం లభించడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. చెట్లు పెంచడం వల్ల సకాలంలో వర్షాలు కురిసేందుకు కూడా వీలుంటుంది. అయితే కొందరు వ్యాపారులు వృక్షాలను నరికి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకొని వృక్ష సంపదను కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

– లోకేష్, గుడ్డగురికి, రొళ్ల మండలం

వృక్ష సంపదను కాపాడాలి



గ్రామాల్లో వృక్ష సంపద అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెట్లు ఉండడం వల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయి. అయితే కొందరు స్వార్థపరులు చెట్లను ఇష్టానుసారంగా నరికి అక్రమం మార్గం గుండా తరలించి సమ్ము చేసుకుంటున్నారు. దీన్ని అరికట్టాల్సిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం దురదృష్టకరం.

– దయానంద్, సోమఘట్ట, రొళ్ల మండలం

నేరాల నియంత్రణకే 'పల్లె నిద్ర'



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

రొద్దం: నేరాల నియంత్రణకే పోలీసులు పల్లె నిద్ర చేస్తున్నారని డీఎస్పీ నరసింగప్ప అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని బీదానిపల్లిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, డెబిట్ కార్డుల నంబర్లు చెప్పవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదుకోవాలని సూచించారు.

పెనుకొండ రూరల్: సమస్యాత్మక గ్రామమైన శెట్టిపల్లిని డీఎస్పీ నరసింగప్ప ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలసి సందర్శించారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో కక్షలకు చోటు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. చిన్నపాటి సమస్య వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు.

సప్పలమ్మ రథోత్సవం



చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండల పరిధిలోని చౌళూరు పంచాయతీ రామచంద్రాపురంలో శనివారం సప్పలమ్మ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవారిని రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయ్

- గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



పెనుకొండ: దర్గాపేటలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, చిత్రంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ శ్రేణులు

పెనుకొండ రూరల్: రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండలోని దర్గాపేటలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా దాడులు, హత్యలు, దౌర్జన్యాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. శనివారం కృష్ణా జిల్లా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పల హారికపై టీడీపీ గుండాలు దాడికి పాల్పడటం బాధాకరమన్నారు. పోలీసుల సమక్షంలోనే దాడులు జరుగుతున్నా నిలువరించలేకపోయారన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలైన జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి చేయడం, అసభ్య పదజాలంతో దూషించడం సరికాదన్నారు. రాష్ట్రంలో మహిళలకే కాదు, మహిళా ప్రజా ప్రతినిధులకు సైతం రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ విధించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. దాడులపై వైఎస్సార్‌సీపీ తరఫున గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామన్నారు.

అమలుకాని హామీలతో మోసం

అధికారమే ధ్యేయంగా కూటమి నాయకలు ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి.. అధికారం చేపట్టాక సంపూర్ణంగా పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారని ఉషశ్రీచరణ్ విమర్శించారు. నాడు వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు వద్దు అని ధర్నాలు చేసిన టీడీపీ నాయకులు నేడు అదే మీటర్ల పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, నగర పంచాయితీ వైస్ చైర్మన్ సునీల్, పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహా, సుధాకర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ మండల కన్వీనర్లు నాగభూరుబాబు, శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు తయూబ్, సద్దాం, నాయకలు వైశాలి జయశంకర్‌రెడ్డి, గణప్ప, యాసిన్, శ్రీరాములు, కిష్టప్ప, బాబు, కొండలరాయుడు, శ్రీరాములునాయుడు, శంకర్‌రెడ్డి, రాము, సిరాజ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రొద్దం: మండల పరిధిలోని రాచూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఈడిగ వెంకటేష్ (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్.. గ్రామానికి వెళ్లి వెంకటేష్ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆమె వెంట మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు గొల్ల నాగేంద్రప్ప, అక్కులప్ప, సి.నారాయణరెడ్డి, చిలకల రవి, ఎన్ నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.8,500 కోట్లు ఎక్కడ ఖర్చుపెట్టారో చెప్పండి?



గోరంట్ల: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

గోరంట్ల: మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే సవిత పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధికి రూ.8,500 కోట్లు ఖర్చు చేసినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారు. అందులో ఎలాంటి నిజం లేదు. ఒక వేల నిధులు తెచ్చి ఉంటే ఏ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ సవాల్ విసిరారు. మండల పరిధిలోని వానవోలు పంచాయతీ పరిధిలోని గుడ్డం రంగనాథస్వామి దేవాలయ ప్రాంగణంలో వానవోలు, వానవోలు తండా గ్రామ పంచాయతీల పరిధిలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ మంత్రి సవిత, ఆమె భర్త కంకర మిషన్ యాజమానులను బెదిరించి, కంకర మిషన్లు తమ ఆధీనంలో ఉంచుకొని ఒకటికి రెండింతల రేట్లతో కంకర అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటున్నారన్నారు. దీనికి తోడు సవిత భర్త, ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణలు ఏర్పాటు చేసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను , వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటేష్, టౌన్ కన్వీనర్ మేదర శంకర, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, ట్రెజరర్ బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు వానవోలు సహకార సంఘం మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, సర్పంచులు శ్రీరాములు, రమణానాయక్, నాయకులు బూదిలి శ్రీనివాసరెడ్డి, రాఘవేంద్రరావు, గాండ్ల మల్లికార్జున, శ్రీనివాసులు, భాస్కరరెడ్డి, ఓబుళరెడ్డి, వడ్డే శ్రీనివాసులు, బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి దుర్మార్గం

- ప్రతిపక్ష నేతలను అందమొందించడానికి కూటమి కుట్ర
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు దీపిక, ఈరలక్కప్ప



టీఎన్ దీపిక



ఈరలక్కప్ప

చిలమత్తూరు: టీడీపీ, జనసేన గూండాలు రాష్ట్రంలో పేట్రేగిపోతున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శనివారం గుడివాడ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు చేసిన దాడి దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. మహిళలపై కూటమి నాయకులు చేస్తున్న నీచమైన అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో జరుగుతుండటం దుర్మార్గ పాలనకు నిలువుటద్దమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు, ప్రభుత్వాలను ప్రశ్నించే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంటుందని తెలియదా అని ప్రశ్నించారు. దారికాచి ఈ దాష్టీకానికి ఒడిగట్టిన కూటమి గూండాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళపై దాడి జరుగుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడమే కాకుండా బాధిత చైర్‌పర్సన్, ఆమె భర్తపై మాటల దాడి చేయడం దురదృష్టకరమన్నారు. ఒక మాజీ మంత్రి ఇంటిని ధ్వంసం చేసినా నేటికీ కేసు కూడా నమోదు చేయకపోవడం, ఇంతలో బీసీ మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి జరగడం చూస్తుంటే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని, ప్రతిపక్షమనేది లేకుండా చేయాలన్న ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని స్పష్టమవుతోందన్నారు. ఎంత మందిని ప్రజాక్షేత్రంలోకి రాకుండా నిలువరిస్తారో చూస్తామని, ఈ బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ భయపడదని గుర్తించుకోవాలన్నారు. ఇటీవల బీసీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థినులు అస్వస్థతకు గురైనా ఆస్పత్రికి చేర్చకుండా మంత్రి కోసం పిల్లల ప్రాణాల మీదకు తెస్తారా అని ప్రశ్నించిన పాపానికి తమ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌పై అక్రమంగా కేసు బనాయించడం సిగ్గుచేటన్నారు.

మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దాడి క్షమించరానిదన్నారు. బీసీ మహిళ అయిన జెడ్పీ చైర్‌పర్సన్‌కే కూటమి ప్రభుత్వంలో రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏంటన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ పాలన సాగిస్తుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలపై దాడులు, అక్రమ కేసులు పెట్టడం మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు.

రాష్ట్రంలో లాఅండ్‌ఆర్డర్ నిర్వీర్యమైపోయింది

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి



చిలమత్తూరు: రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. ఆదివారం ఆమె చౌళూరులో విలేకరులతో మాట్లాడారు. గుడివాడ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన అల్లరి మూకలు చేసిన దాడిని ఆమె ఖండించారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు హెచ్చుమీరుతున్నా పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇలానే పోలీసు వ్యవస్థ కొనసాగితే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పుతాయన్నారు. దాడులు తెగబడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నిలువరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామంలో కొల్లపూరదమ్మదేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొల్లపూరదమ్మదేవి విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.

అనారోగ్యంతో గ్రీన్ అంబాసిడర్ మృతి



మంజునాథ్ (ఫైల్)

అగళి: మండల కేంద్రంలో గ్రీన్ అంబాసిడర్ మంజునాథ్ (44) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మూడు రోజుల క్రితం ఆయన అనారోగ్యానికి గురి కావడంతో కర్ణాటక రాష్ట్రం తుమకూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించి మంజునాథ్ మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి కుమార్తె ఉంది.

ఆలయ నిర్మాణానికి విరాళం

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లిలో వెలసిన శ్రీరామ దేవాలయం నిర్మాణానికి బెంగళూరు చెందిన బూరుడు గంటా జనార్దన్ ఆదివారం రూ. 50 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థి ధనుశ్రీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీధర్ తెలిపారు. ఒంగోలు క్యాంపస్‌కు విద్యార్థి కావడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సజావుగా ఎస్‌కేఎస్ ఎన్నికలు

పావగడ: స్థానిక ఎస్ఎస్‌కే (శ్రీ శని మహాత్మ కార్యనిర్వాహక) సంఘం ఎన్నికలు ఆదివారం సజావుగా నిర్వహించారు. ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప సైతం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 15 డైరెక్టర్ల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 26 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. మొత్తం 143 ఓట్లలో 139 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి సోమసుందర్ తెలిపారు.



ఎండుతున్న కంది మొక్కలు



కళావిహీనంగా మారిన వేరుశనగ పంట

ఎండుతున్న ఆశలు

మడకశిరరూరల్: నియోజకవర్గంలో వర్షం రాక పోవడంతో అరకొర తేమలో రైతులు సాగు చేసిన వేరుశనగ, కంది పంటలు మొక్కల దశలోనే ఎండుముఖం పట్టాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వరుణుడు కరుణించి ఎండుతున్న పంటలకు ప్రాణం పోయాలని రైతులు వరుణ దేవుడిని వేడుకుంటున్నారు.

అమ్మవారిపల్లిలో చోరీ

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లి గ్రామంలో స్టేట్ బ్యాంక్ సమీపంలో నివాసముంటున్న రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో దొంగతనం జరిగింది. ఆయన తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం ఉదయమే పొలం పనుల కోసం వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు పట్టపగలే చోరీకి తెగబడ్డారు. రాజశేఖర్‌రెడ్డి ఇంట్లోని రూ. 50 వేల నగదు, 25 తులాల వెండి, తులం బంగారు ఉంగరాన్ని ఎత్తుకెళ్లారు. సీఐ రాఘవన్ ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

20న అభినయ పోటీలు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 20న తేనే తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల కళాకారులచే పద్య, నాటక, ఏకపాత్ర అభినయ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ కళాభిషేకం పి.సాయి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారి ప్రతిభను ప్రోత్సాహించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.